# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ సిహెచ్. రామోజీరావు మృతి పట్ల రాష్ట్రపతి, ప్రధానమంత్రి సహా పలువురు ప్రముఖులు నివాళులర్పించారు.**

**2. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహించారు.**

**3. రేపు ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి న్యాయ ప్రవేశ పరీక్ష-ఏపీ లాసెట్, ఏపీ పీజీ లాసెట్- 2024 పరీక్షలు జరుగుతాయి.**

**4. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో పల్నాడు జిల్లాలో విధించిన 144 సెక్షన్ అమలు ముగిసిందని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠ్కర్ తెలిపారు.**

**5. ఈ రోజు బ్రెయిన్ ట్యూమర్ అవగాహనా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ సిహెచ్. రామోజీరావు ఈ రోజు తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. రామోజీరావు మృతి పట్ల రాష్ట్రపతి, ప్రధానమంత్రి సహా పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. పాత్రికేయ, సినీ రంగంపై రామోజీ రావు చెరగని ముద్రవేశారని పేర్కొంటూ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం వ్యక్తం చేశారు. రామోజీ రావు మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మీడియాలో సరికొత్త ప్రమాణాలు నెలకొల్పారని సామాజిక మాధ్యమం వేదికగా ఆయన పేర్కొన్నారు. రామోజీరావు మీడియా, వినోద రంగంలో నిష్ణాతులని, తెలుగు జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పడంలో ప్రసిద్ధి చెందారని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒక సామాన్య కుటుంబంలో జన్మించి రామోజీరావు అసామాన్య విజయాలు సాధించారని అన్నారు. తెలుగు పత్రికారంగానికి దశాబ్దాలుగా రామోజీరావు ఎనలేని సేవలందించారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు.

--------------------------

జూన్ 21వ తేదీన జరగనున్న 2024 అంతర్జాతీయ యోగ దినోత్సవం నిర్వహణ ఏర్పాట్లపై కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాజేష్ కొటేచా సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నెల 21వ తేదీన జరిగే యోగ దినోత్సవ కార్యకలాపాలలో భాగంగా యోగ పట్ల అవగాహన కల్పించడానికి వైవిధ్యభరితమైన కార్యక్రమాలను

నిర్వహించనున్నామని తెలిపారు. యోగా వల్ల కలిగే ఉపయోగాలపై పత్రిక సమాచార కార్యాలయం పి.ఐ.బి., ప్రసార భారతి, తదితర విభాగాలతో పాటు, వివిధ మీడియా శాఖలు ముఖ్యమైన కార్యక్రమాలను రూపొందిస్తున్నాయని దూరదర్శన్, ఆకాశవాణి ద్వారా ఈ కార్యక్రమాలు ప్రసారమవుతాయచి చెప్పారు. దూరదర్శన్ ద్వారా యోగా నిపుణుల చేత ప్రత్యేక ప్రత్యక్ష కార్యక్రమంతో పాటు, ఆకాశవాణి ద్వారా యోగాను జీవన విధానంగా ప్రోత్సహించే కార్యక్రమాలను ప్రసారం చేస్తారని వివరించారు.

---------------------------

జూన్ 12వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న క్రమంలో ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిరభ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గత రాత్రి తాడేపల్లిలోని పంచాయతీ రాజ్ కార్యాలయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమ ఏర్పాట్లుపై మాజీ మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తాతో కలిసి ప్రాధమిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిరభ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ, బహిరంగ సభ కార్యక్రమానికి అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా సభా వేదికను రెయిన్ ప్రూఫ్‌తో ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్, త్రాగు నీరు వంటి ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి న్యాయ ప్రవేశ పరీక్ష – ఏపీ లాసెట్, ఏపీ పీజీ లాసెట్– 2024 పరీక్షలను రేపు మధ్యాహ్నం 2గంటల 30 నిమిషాల నుంచి 4 గంటల వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కన్వీనర్ ఆచార్య బి.సత్య నారాయణ తెలిపారు. న్యాయ విద్యకు సంబంధించి మూడేళ్ల ఎల్ఎల్బీ, ఐదేళ్ల ఎల్ఎల్బీ, రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్ష నిర్వహణ కోసం 105 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల 30 నిమిషాల వరకు అనుమతిస్తామన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించమని తెలిపారు.ఏపీ లాసెట్ పరీక్షకు 23 వేల 425 దరఖాస్తులు వచ్చాయన్నారు. లాసెట్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు.

---------------------------

ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు 18వ ముంబై అంతర్జాతీయ చలన చిత్రోత్సవం నిర్వహించనున్నామని సమాచార ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. నిన్న ఢిల్లీలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ చిత్రోత్సవంలో భాగంగా ఢిల్లీ, చెన్నై, పూనె, కోల్ కత్తాలలో 59 దేశాలకు చెందిన 314 చలన చిత్రాలను ప్రదర్శిస్తారని చెప్పారు. అలాగే జపాన్, రష్యా, ఇరాన్, ఇటలీ, వియత్నాం, మాలీ దేశాలకు చెందిన 17 సినిమాలను ప్రదర్శిస్తారన్నారు. చలన చిత్రోత్సవంలో ఎనిమిది ప్రపంచ సినిమా ప్రదర్శనలు, ఆరు అంతర్జాతీయ ప్రదర్శనలు, 17 ఆసియా ప్రదర్శనలు, 15 భారత ప్రదర్శనలు వుంటాయని వివరించారు.

---------------------------

ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో పల్నాడు జిల్లాలో విధించిన 144 సెక్షన్ అమలు ముగిసిందని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠ్కర్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో నిన్న నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మలికా గార్గ్ కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ, పోలింగ్ రోజు జరిగిన ఘర్షణల

నేపథ్యంలో జిల్లాలో 28 రోజులు 144 సెక్షన్ అమలు చేశామన్నారు. శాంతి భద్రతలు అదుపులోకి రావడంతో 144 సెక్షన్ నిలుపుదల చేశామని చెప్పారు. ర్యాలీలు, సమావేశాలకు మాత్రం పోలీసుల అనుమతి తప్పనిసరి తెలిపారు. జిల్లా ఎస్పీ మలికా గార్గ్ మాట్లాడుతూ, సమస్యాత్మక గ్రామాలలో పోలీస్ పెట్రోలింగ్ కొనసాగుతుందని చెప్పారు. జిల్లాలో ఘర్షణలకు పాల్పడితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

---------------------------

నేర చట్టాలను కేంద్ర ప్రభుత్వం సవరణ చేసి అమలు చేయడాన్ని న్యాయవాదులు స్వాగతిస్తున్నారు. కక్షిదారులకు కొత్త చట్టాలు ఎంతగానో ఉపయోగపడుతుందని అంటున్నారు. జులై ఒకటో తేదీ నుంచి ఈ సవరణ చేసిన చట్టాలను అమలు చేయడం ద్వారా న్యాయవ్యవస్థపై ప్రజల్లో మరింత నమ్మకం ఏర్పడే అవకాశం ఉందంటుని తిరుపతికి చెందిన న్యాయవాది బి.వాసుబాబు ఆకాశవాణికి తెలియజేస్తూ..

వాయిస్ ...15 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ప్రధాన నగరాల్లో అతిసార వ్యాధి విస్తరించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళగిరిలోని వైద్య శాఖ ప్రధాన కార్యాలయంలో అన్ని జిల్లాల వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది నిన్న ఆయన దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అతిసార వ్యాధి ప్రబలకుండా ఆయా నగరాల్లోని వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టణ, నగర ప్రాంతాల్లో నీటి నమూనాల పరీక్ష కోసం నాలుగు మొబైల్ టెస్టింగ్ వాహనాలను ఉపయోగించుకోవాలన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు మరింతగా ప్రబలే అవకాశం ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో దోమ తెరల్ని సరిపడా సరఫరా చేయాలని, అలాగే గిరిజన సంక్షేమ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

---------------------------

మానవ శరీరంలో మెదడు ఎంతో కీలకమైనది. మన మెదడుపై అవగాహన కలిగివుండటం ప్రతి ఒక్కరికీ ఎంతైనా అవసరం. మెదడులో ఏర్పడే కణుతులు, బ్రెయిన్ ట్యూమర్ గురించి అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు ఈ రోజు బ్రెయిన్ ట్యూమర్ అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రధానంగా జన్యు లోపాల వల్ల బ్రెయిన్ ట్యూమర్లు ఏర్పడే అవకాశం ఉంది. వృద్ధాప్యంలో కూడా ఈ వ్యాధి సంక్రమించవచ్చు. అయితే... బ్రెయిన్ ట్యూమర్ను సకాలంలో గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే ఈ వ్యాధిని నివారించడం సాధ్యమేనని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

---------------------------

ఏలూరు జిల్లాలో మిషన్ వాత్సల్య పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వి. ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో బాలల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలపై వివిధ శాఖల అధికారులుతో కలెక్టరు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరాదారణకు గురైన బాలలకు విద్యా, ఆరోగ్యం, అభివృద్ధి వంటి అవసరాలకు వాత్సల్య

పథకం కింద ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు.

---------------------------

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శివశంకర్ తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లా చిలమత్తూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిన్న ఆయన ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

---------------------------

వర్షాకాలం దృష్ట్యా వరదలు వంటి ప్రకృతి విపత్తులను ఎదుర్కునేందుకు ముందస్తు కార్యచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డా. కే.మాధవీలత అధికారులను ఆదేశించారు. నిన్న రాజమహేంద్రవరంలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రకృతి విపత్తుల ఏర్పడినప్పుడు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ దృశ్య మాధ్యమం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అధికారులు గోదావరి పరివాహక ప్రాంతపు గట్లను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో ఉన్న చెరువులను జలవనరుల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి మరమత్తు పనులు పనులను పూర్తి చేయాలని తెలిపారు.

---------------------------

ఐసీసీ టీ20 క్రికెట్ ప్రపంచ కప్‌లో భాగంగా రేపు న్యూయర్క్ వేదికగా భారత్, పాక్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుంది. భారత కాలమానం ప్రకారం రేపు రాత్రి 8 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభమవుతుంది.

---------------------------

రాయలసీమపై ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం దక్షిణ తెలంగాణ పరిసర ప్రాంతాల్లో విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు నైరుతి రుతుపవనాలు క్రమంగా విస్తరిస్తున్నాయని వచ్చే రెండు మూడు రోజుల్లో ఇవి కోస్తాంధ్రలోని మిగిలిన భాగాలు, పశ్చిమ మధ్య బంగాళాఖాతం, వాయవ్య బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాల్లో మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజులు వానలు కొనసాగనున్నాయని పలు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

=====================